క్లుప్తంగా

ఎంపీపీని కలిసిన ప్రత్తికోళ్లలంక ఎస్సీలు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక ఎస్సీ పెద్దలు, యువకులు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజును బుధవారం ఉదయం మండలపరిషత్ కార్యాలయంలో కలిశారు. భూములు లేక ఉపాధి కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రత్తికోళ్లలంక గ్రామ పెద్దలిచ్చిన హామీ మేరకు భూమి కేటాయించేలా కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీపీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కొఠారు రామచంద్రరావుతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

21న వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం : వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు శుక్రవారం వేలం నిర్వహిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం ఎస్సై ఎం.సాగర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఈబీ డీఎస్పీ, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో జప్తు చేయబడిన మోటార్ సైకిళ్లను వేలం వేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు ఆధార్‌కార్డుతో హాజరు కావాలని, వివరాలకు ఎస్ఈబీ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన గుండుబోయిన సాయి అచ్యుత్ వ్యక్తి పనుల నిమిత్తం ఈ నెల 3న జంగారెడ్డిగూడెం వచ్చాడు. ఈ క్రమంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద కేటీఎం 200 డ్యూక్ మోటార్ సైకిల్‌ను పార్క్ చేసి, టీ తాగి వచ్చి చూడగా కనిపించలేదు. అప్పటి నుంచి వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోటార్‌సైకిల్ విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని అచ్యుత్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై చెప్పారు.

పోలీసులపై చంద్రబాబు జులుం ప్రదర్శించడం తగదు

పెదపాడు: పోలీసులపై చంద్రబాబు జులుం ప్రదర్శించడం దుర్మార్గమని నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు అన్నారు. ఇటీవల నూజివీడులో పోలీసులపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. పోలీసులు పెట్టిన ప్రతి కేసు పరిశీలించి వారిపై తిరిగి కేసులు పెడతానని చెప్పడంపై చంద్రబాబు తీరు ప్రజలకు అద్దం పడుతోందని విమర్శించారు. చంద్రబాబును ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. పోలీసులు ఎవరికీ వత్తాసు పలకరని పార్టీ భేదాలు చూపరని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తూ పోలీసులతో తగాదా పడి వారిపై దురుసుగా వ్యవహరించడం చంద్రబాబుకు అలవాటుగా మారిందన్నారు. నాయకులు పామర్తి అచ్యుత్ గౌడ్, సాధం కిశోర్, గుణపూరు మహేష్ పాల్గొన్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- వైద్య రంగానికీ ప్రాధాన్యత
- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- ఏలూరు 12వ డివిజన్‌లో 93వ రోజు పాదయాత్ర



12వ డివిజన్‌లో లబ్ధిదారుల సమస్య వింటున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: రాష్ట్రంలో విద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వేలకోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో 93వ రోజు బుధవారం ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని12 డివిజన్‌లో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతా పింఛన్ సక్రమంగా అందుతుందా? అమ్మా పిల్లలకు అమ్మ ఒడి డబ్బులు అందాయా? ఇటీవల వేసిన డ్వాక్రా రుణమాఫీ సొమ్ము ఖాతాల్లో పడిందా అంటూ నాని ఆరా తీశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ నాడు నేడు పథకంలో ఏలూరులోని నగరపాలక సంస్థ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, ఆధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారని చెప్పారు. విద్యార్థులకు విద్యా సంవత్సరం ఆరంభంలోనే పాఠ్య పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్, టైలు, అన్నీ అందిస్తూ చదువును ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు జూన్ నెలలో స్కూళ్లు తెరిస్తే నవంబర్ నాటికి కూడా పాఠ్య పుస్తకాలు పిల్లలకు అందించే పరిస్థితి ఉండేది కాదని గుర్తు చేశారు. నేడు ప్రభుత్వ బడుల్లో నో వెకెన్సీ బోర్డులు పెట్టే స్థాయిలో సీఎం జగన్ ప్రభుత్వ స్కూళ్ల స్థాయిని పెంచారని చెప్పారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యత, రుచికరమైన వంటలతో అందిస్తూ పిల్లల అభిమానాన్ని పొందుతున్నారని వివరించారు. ఏదైనా సాంకేతిక లోపంతో సంక్షేమ పథకానికి ఎవరైనా దూరమైతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ పథకాలు చేరువ చేయాలని అధికారులను నాని ఆదేశించారు. ఆయనకు తొలుత డివిజన్‌లోని పార్టీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు మంచెం మైబాబు, కురెళ్ల రామ్ ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, బండారు కిరణ్‌కుమార్, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, సుంకర చంద్రశేఖర్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ నాయకులు మోటమర్రి సదానందం, కాపా రఘు, యల్లాపు మోజెస్, బండ్లమూడి సునీల్, పిట్టా ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

జేసీని కలిసిన ఏపీఎన్‌జీఓలు



జేసీ లావణ్య వేణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఏలూరు(మెట్రో): జేసీ లావణ్యవేణిని బుధవారం ఏపీఎన్‌జీఓ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఇటీవల బాధ్యతలను స్వీకరించిన ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సహకారం పాలనలో ముఖ్యమని, అందరూ చక్కగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటు పడాలని జేసీ సూచించారు. జేసీని కలిసిన వారిలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్‌జీఓ సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, ఏలూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీధర్‌రాజు, కప్పల సత్యనారాయణ, నరేంద్ర, విమెన్ వింగ్ చైర్‌పర్సన్ కె.నాగమణి, లీలారాణి, సత్యభారతి, తదితరులు పాల్గొన్నారు.

20న ఇఫ్తార్ విందు

ఏలూరు (టూటౌన్): జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ఎస్ కృపావరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం 6.30 గంటలకు ఏలూరు సురేష్ చంద్ర బహుగుణ పోలీసు కల్యాణ మండపంలో విందు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని మసీదు కమిటీ పెద్దలు, మూతవలీలు, ఇమాములు, ముస్లింలు పాల్గొనాలని కృపావరం కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సమీక్ష అనంతరం కార్పొరేటర్, సచివాలయ సిబ్బందితో ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులు, ఫిర్యాదుల పరిష్కారంపై కార్పొరేషన్, రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఏలూరు 30వ డివిజన్ 13వ సచివాలయం, 10వ డివిజన్ 62వ సచివాలయం పరిధిలో గడపగడపకు కార్యక్రమంలో ప్రజలు ఆయా సమస్యలపై ఇచ్చిన వినతుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌లోనూ స్థానిక సమస్యలను పరిష్కరిస్తూ ఉత్తమ సేవలు అందించాలన్నారు. సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షలో ఏలూరు కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, 30వ డివిజన్ కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వరరావు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, పీఓ కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణానికి కార్యాచరణ

- నిర్మాణ వ్యర్థాలు ఇష్టానుసారం పడేస్తే జరిమానా
- జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఏలూరు నగర వాసులకు స్వచ్ఛమైన గాలి, మంచి వాతావరణం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం నిర్వహించిన కాలుష్య నియంత్రణ మండలి, నగరపాలక సంస్థ, రవాణా, పోలీస్, అటవీ, పరిశ్రమలు, ఎన్‌హెచ్ తదితర అధికారులతో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఏలూరులో వాయు కాలుష్య నియంత్రణ కార్యక్రమాల నిమిత్తం నగరపాలక సంస్థకు ముందస్తుగా సుమారు రూ.4 కోట్ల నిధులు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మంజూరు చేసిందన్నారు. నగరంలోని పాత బస్టాండు, ఏఎస్ఆర్ స్టేడియం, జూట్ మిల్ సెంటర్, గూడ్స్ షెడ్ జంక్షన్, బిర్లా సెంటర్, కండ్రికగూడెం, తంగెళ్లమూడి, విజయవిహార్ సెంటర్, శాంతినగర్, ప్రాంతాల్లో వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. వాయు కాలుష్య స్థాయిని 20 నుంచి 80 శాతానికి తగ్గించి, గాలిలో నాణ్యతను పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. శాంతినగర్ వై.జంక్షన్, జూట్ మిల్, పాత బస్టాండు వద్ద వాటర్ ఫౌంటెన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశ్రం ఆసుపత్రి నుంచి కలపర్రు టోల్ గేట్ వరకు జాతీయ రహదారి డివైడర్‌పై గ్రీన్ బెల్ట్ నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అన్నారు. శాంతినగర్ ప్రాంతంలో ప్లాంటేషన్ గార్డెనింగ్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. జూట్ మిల్ వద్ద కృష్ణాకాలువ బండ్‌పై పార్క్ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గూడ్‌షెడ్ వద్ద, ఏలూరు రైల్వే ప్లాట్ ఫ్లామ్ పై వెట్ మ్యాపింగ్ చేయాలన్నారు. ఆశ్రం ఆసుపత్రి వద్ద, కలపర్రు సమీపంలోని ఎన్టీ రంగారావు విగ్రహం ప్రాంతాల్లో గోతులను పూడ్చి గ్రీనరీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వాయు కాలుష్య నియంత్రణలో భాగంగా సీఎన్‌జీ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు, సీఎన్‌జీ ఆటోలు సమకూర్చుకునేందుకు డ్రైవర్లకు వెసులు బాటు కల్పించే దిశగా పరిశీలన చేయాలన్నారు. జన్మభూమి పార్కులో గ్రీనరీ, వాటర్ ఫౌంటేన్ పనులు చేపట్టాలన్నారు. విజయ డైరీ, మరో ప్రాంతంలో ఫుడ్ పార్క్ పనులను సోమవరంలోపు ప్రారంభించాలన్నారు. బుద్ధాపార్క్‌లో ఫౌంటేన్ అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని అన్నారు.

సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

నగరంలో ముఖ్యంగా తమ్మిలేరు – తంగెళ్లమూడి, ఏలూరు రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న గోదావరి కాలువగట్లపై ఇష్టానుసారం నిర్మాణ వ్యర్థాలను పడేసే వారిని గుర్తించి భారీగా పెనాల్టీ విధించడంతోపాటు సంబంధిత వాహనాలు సీజ్ చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కె.వెంకటేశ్వరరావు, నగర మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డీఎస్పీ పైడేశ్వరరావు, ట్రాఫిక్ సీఐ దుర్గాప్రసాద్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు, డీటీసీ కె.శ్రీహరి, డీఎఫ్ఓ ఎం.హిమశైలజ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, నెడ్ క్యాప్ డీఎం డీవీ ప్రసాద్, పలువురు ఎన్‌హెచ్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ప్రజలవద్దకే ప్రజాప్రతినిధులు



30వ డివిజన్‌లో ఇంటి గోడకు స్టిక్కర్ అతికిస్తున్న నాయకులు

- ఏలూరులో జగనన్నే మా భవిష్యత్తు
- ప్రతి ఇంటి గడపపైనా జగనన్న ముద్ర

ఏలూరు టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజల్లోకి వెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమానికి నాందిపలికారు. గతంలో ప్రజల్లోకి వెళ్లేందుకే రాజకీయ పార్టీల నాయకులు భయపడేవారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జవాబుదారీతనాన్ని తీసుకొస్తూ ప్రజలవద్దకే ప్రజాప్రతినిధులను తీసుకెళ్లే సరికొత్త కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఏలూరు నియోజకవర్గంలో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గత 13 రోజులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మమేకమవుతున్నారు. ఆయా గృహాల్లో ప్రభుత్వం ద్వారా అందుతోన్న ఉపకారాలను అడిగి తెలుసుకుంటున్నారు. సీఎం జగన్‌పై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకుంటూ.. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో తమ నాయకులను గెలిపించుకునేందుకు శ్రమిస్తున్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మాకెంతో మేలు జరుగుతోంది. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో ప్రతి సంక్షేమ పథకమూ అందుతుంది. నా మనవళ్లకు అమ్మ ఒడి వస్తుంది. చేయూత, చేదోడు పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నాం. మా ఆయనకు పింఛను వస్తుంది. మా ఇద్దరి కోడళ్లకూ ఉపాధి కోసం చేదోడు అండగా ఉంటుంది. సీఎం జగన్‌కు మేమంతా అండగా ఉంటాం.

– దెక్కత సత్యవతి, ఏలూరు

జగనన్న ఇల్లు ఇచ్చారు



జగనన్న ప్రభుత్వం వల్ల నాకు సొంతిల్లు కట్టుకునే అవకాశం వచ్చింది. ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో ఇంటి స్థలం మంజూరైంది. ప్రభుత్వం నాకు ఇల్లు కట్టిస్తుంది. మా అత్తకు నెల నెలా పింఛన్ అందుతుంది. ప్రతి పేదవాడికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంచి జరుగుతోంది. మహిళలంతా సీఎం జగనన్న వెంటే ఉన్నారు. మా ఇంటికి సీఎం జగనన్న స్టిక్కర్ అతికించుకున్నాం.

– బంకపల్లి అనూష, ఏలూరు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	46
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	96
బీరకాయలు (పందిరి)	56	అల్లం	130
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	18	చుక్కకూర	10
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	18-20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణీ	60
అనబకాయ (1)	10-12	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	31
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - బెంగళూరు	14.00	4021	--
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కేంద్రం విధానాలతో ప్రజలకు కష్టాలు



ప్రచార భేరి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిశేషు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజలపై మోయలేని భారాలు వేస్తోందని సీపీఎం జిల్లా నాయకులు పిచ్చుక ఆదిశేషు, సీపీఐ ఏలూరు నగర కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ విమర్శించారు. సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో బుధవారం చొదిమెళ్ల, తంగెళ్లమూడి ప్రాంతాల్లో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశేషు, హేమశంకర్‌లు మాట్లాడుతూ 2014 ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు, ధరల అదుపు, పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షల జమ తదితర వాగ్దానాలు అమలు కాలేదని ఆరోపించారు. పేదల నడ్డి విరిచే విధంగా నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచుకుంటూ పోతున్నారని వాపోయారు. ఏలూరులో రెండు వేల మంది పనిచేసే జూట్ మిల్లును నేటికీ తెరిపించలేకపోయారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పల్లెం కిషోర్, నగర నాయకులు బి.జగన్నాథరావు, ఏసుబాబు, కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు ప్రసాద్, మావూరి విజయ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఈ కృష్ణమోహన్ పనితీరుపై విచారణ

ఏలూరు రూరల్ : ఏలూరు మండలం పీఆర్ఏఈ కృష్ణమోహన్ పనితీరుపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్వీవీ సత్యనారాయణ విచారణ చేపట్టారు. బుధవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సరళకుమారి సమక్షంలో పలు అభివృద్ధి పనులు, రికార్డులపై ఆరా తీసారు. కొద్దిరోజుల్లో రికార్డులు సమర్పించాలని ఏఈను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. గతేడాది సెప్టెంబర్ 27న చైతన్యభారతి సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బి.చిట్టిరాజు ఏలూరు, భీమడోలు, ఉంగుటూరు మండల ఏఈలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు చేపట్టి అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ పనులపై ఆర్టీఐ యాక్ట్ ద్వారా సమాచారం కోరినప్పటికీ ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈను విచారణ చేపట్టిన నివేదిక అందించాలని ఆదేశించారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



లచ్చన్నకు నివాళులర్పిస్తున్న రాజగోపాలచారి

ఏలూరు (టూటౌన్): బీసీ కులాల పితామహుడు, సామాజిక విప్లవ మూర్తి సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతి కార్యక్రమం వివిధ బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు అర్బన్ ఆధ్వర్యంలో లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏలూరు అర్బన్ అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలచారి మాట్లాడుతూ దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత ఆ సర్దార్ బిరుదు పొందిన ఏకైక వ్యక్తి లచ్చన్న అని కొనియాడారు. ఆయన ధైర్య సాహసాలు, పట్టుదల, ఓర్పు, సహనం, కార్యదీక్షకు మెచ్చి ప్రజలే ఆయనకు సర్దార్ అనే బిరుద ఇచ్చారని చెప్పారు. వీవీ గిరి, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ధర్మ తేజ తదితరుల సాహచర్యంలో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి అనేక సార్లు లచ్చన్న జైలు కెళ్లారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలు గుత్తుల బాలా త్రిపుర సుందరి, ఏలూరు జిల్లా ఫొటో గ్రఫీ జనరల్ సెక్రెటరీ గుత్తుల దుర్గారావు, యువజన సంఘం కార్యదర్శి ఈదలాడ నాని, తూర్పుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు అబ్బిరెడ్డి రంగ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

జకాత్, ఫిత్రాలతో అల్లాకు చేరువ



ముస్లింలకు నగదు, పండ్లు పంపిణీ చేస్తున్న మస్తాన్ బాషా



గిరీష్‌ను సన్మానిస్తున్న మసీదు పెద్దలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పవిత్ర రంజాన్ మాసంలో జకాత్, ఫిత్రా దానాలతో అల్లాహ్‌కు చేరువ కావచ్చని ప్రముఖ ముస్లిం నాయకుడు ఎండీ మస్తాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ కాలనీలోని సుమారు 200 ముస్లిం కుటుంబాలకు ఆయన నగదు, పండ్లు పంపిణీ చేశారు. దివ్య ఖుర్‌ఆన్ గ్రంథం ప్రతి ముస్లిం తాను సంపాదించే సంపాదనలో 2.5 శాతం జకాత్ రూపంలో దానం చేయాలని చెబుతోందని బాషా అన్నారు. ఆహారం, ధాన్యం, ధనం, వస్త్రం రూపంలో దానం చేయాలన్నారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలతో పాటు దాన ధర్మాలు చేయడం అత్యంత పుణ్యకార్యమన్నారు. కార్యక్రమంలో జహీరున్నీసా బేగం, అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస దీక్షలో హిందూ బాలుడు

ఖురాన్ గ్రంథం ఆవిర్భవించిన మాసంగా రంజాన్ మాసాన్ని పరిగణిస్తూ ముస్లింలు ఉపవాస దీక్షలు చేయడం చూస్తుంటాం. ఈ దీక్షలకు ఆకర్షితుడైన నగరానికి చెందిన ఒక బాలుడు గత 25 రోజులుగా ఉపవాస దీక్షలు చేస్తున్నాడు. సింహాద్రి గిరీష్ అనే బాలుడు స్థానిక గన్ బజారులోని రైల్వేగేట్ మసీదులో ముస్లింలతో కలిసి ఉపవాస దీక్షలు చేస్తూ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటున్నాడు. విశ్వశాంతి, లోక కల్యాణం కోసం ముస్లింలు చేస్తున్న దీక్షలకు మద్దతుగా తాను దీక్షల్లో పాల్గొంటున్నానని గిరీష్ చెబుతున్నాడు. గిరీష్‌ను రైల్వేగేట్ మసీదు కమిటీ ప్రతినిధులు ఎండీ సులేమాన్, రాజా అహ్మద్, అంజాద్ షరీఫ్, ఎండీ ఎగ్బాల్ మసీదు పేష్ ఇమామ్ ఎండీ రవూఫ్‌లు బుధవారం సత్కరించారు.